

# సరైన మార్గం

-కొల్లూరి సోమశంకర్

గిరి సీతానగరం హైస్కూలులో 8వ తరగతిలో కొత్తగా చేరాడు. ఆటలలో ప్రావీణ్యం చూపడంతో, చేరిన కొద్ది రోజులకే గిరి స్కూలులో అందరినీ బాగా ఆకట్టుకొన్నాడు. స్కూల్‌లో త్రైమాసిక పరీక్షలు జరుగుతున్నాయి. "గిరి, ఏమిటి నువ్వు చేస్తున్న పని, తప్పు కదూ," గద్దించారు (పర్యవేక్షకుడి)గా వచ్చిన లెక్కల మాస్టారు. పక్క విద్యార్థి జవాబు పత్రం నుంచి కాపీ చేయడానికి ప్రయత్నిస్తున్న గిరి తల దించుకుని- "క్షమించండి సార్! నేను సరిగా చదవలేదు. మార్కులు బాగా రాక పోతే మా అమ్మా - నాన్నగారు తిడతారు. అందుకని ఇలా చేసాను. ఇంకెప్పుడు ఇలా చెయ్యను మాస్టారు" అన్నాడు పరీక్ష రాయ డం ఆపి గిరికేసి చూస్తున్న మిగతా విద్యార్థు లను పరీక్ష రాయమని హెచ్చరించి, పరీక్ష అయిపోయాక ఇంటికి వెళ్ళేముందు తనని కలిసి వెళ్ళమని గిరితో చెప్పి పరీక్ష రాస్తున్న విద్యార్థులను గమనించసాగారు లెక్కల మాస్టారు.

పరీక్ష అయిపోయాక, ఇంటికి వెళ్ళే ముందు స్టాఫ్‌రూంకి వెళ్ళి లెక్కల మాస్టారుని కలిసాడు. "మాస్టారు, దయచేసి ఈ విషయాన్ని మా అమ్మ, నాన్న గారికి చెప్పకండి" అంటూ బ్రతిమిలాడు. "నువ్వు చాలా తెలివైన వాడివని విన్నాను. మరి ఇలా చేసావేమిటి? నీకు కాపీ కొట్టాల్సిన అవసరం ఏముంది? నువ్వు నిజం చెబితే మీ వాళ్ళకు ఫిర్యాదు చెయ్యను. అసలు కారణం చెప్పు" అని అడిగారు లెక్కల మాస్టారు.

"కొన్ని పాఠాలు అర్థం కాలేదు మాస్టారూ. క్లాసులో సందేహాలు అడుగుదామంటే మిగతా పిల్లలు నవ్వుతారేమో అని సంకోచించాను. వాటిని చదవకుండా వదిలేసాను. పైగా పరీక్షల ముందు టి.వి.లో క్రికెట్ మ్యాచ్‌లు చూసాను. దాంతో పరీక్ష ముందు చదువుదామనుకున్న ప్రశ్నలకు జవాబులు చదవలేకపోయాను. అందువల్ల ఇలా కాపీ కొట్టి మార్కులు పొందాలని ప్రయత్నించాను మాస్టారూ" - అని నిజాయితీగా తన తప్పు ఒప్పుకున్నాడు గిరి.

"చూడు గిరీ, నువ్వు ఎంచుకున్న మార్గం తప్పు. ఇలా కాపీ కొట్టి మార్కులు సంపాదించుకుంటే, అది తాత్కాలిక విజయం మాత్రమే! అది ఇప్పుడు నీకు, మీ వాళ్ళకు సంతోషాన్ని కల్గించినా, భవిష్యత్తులో నీకు ఏ మాత్రం ఉపయోగపడదు. కాపీ కొడితే మార్కులైతే సాధిస్తావేమో కాని, ఆయా పాఠాలపై ఎప్పటికీ పట్టు సాధించలేవు. వాటిలోని విజ్ఞానాన్ని గ్రహించలేవు. పైగా ఈసారి కాపీ కొట్టడంలో సఫలమైతే, మరోసారి లేదా ప్రతీసారి దానికే అలవాటు పడిపోతావు. అప్పుడు నీ భవిష్యత్తు ఏమిటి తెలివితేటలు, జ్ఞాపకశక్తి, కష్టపడే తత్వం ... ఇలాంటి సుగుణాలన్నీ మరుగున పడిపోయి, నువ్వు ఇతరులపై ఆధారపడిపోయే వ్యక్తిలా మిగిలిపోతావు. నువ్వు ఇలా తయారవ్వాలని మీ తల్లిదండ్రులు కోరుకోరు కదా" అడిగారు లెక్కల మాస్టారు.

ఈ సంభాషణ అంతా వింటున్న మరో మాస్టారు 'ఇంత వివరణ ఎందుకు మాస్టారూ. నాల్గు దెబ్బలు వేస్తే, మళ్లీ ఎప్పుడు ఇలాంటి పని చెయ్యడు' అని అన్నారు. 'అన్ని సందర్భాల్లోను దండన అవసరం లేదు మాస్టారూ' అన్నారు లెక్కల మాస్టారు. ఆయనే మళ్ళీ మాట్లాడుతూ ... "గిరీ, విజ్ఞానాన్ని కష్టపడి గ్రహించాలి కాని ఇలాంటి తప్పుడు పద్ధతుల వల్ల కాదు.

పాఠాలలోని విజ్ఞానాన్ని గ్రహించాలంటే క్లాసులో పాఠాలు శ్రద్ధగా వినాలి. ఏవైనా సందేహాలుంటే, వెనుకాడకుండా వాటిని నివృత్తి చేసుకోవాలి. ఏరోజు చెప్పిన పాఠాలు ఆ రోజే చదువుకోవాలి. అలా ముఖ్యంగా విద్యార్థి దశలో క్రమశిక్షణ చాలా అవసరం. సమయాన్ని వృథా చెయ్యకుండా, చదువుకి, మానసిక అభివృద్ధికి ఉపయోగించుకోవాలి. అప్పుడే మీ తల్లిదండ్రులు ఆశించినట్లు నువ్వు జీవితంలో అభివృద్ధిలోకి వస్తావు" అని వివరించారు.

తన భావి జీవితాన్ని సరైన మార్గంలో నడిపించటం కోసం, మాస్టారు చేసిన విలువైన సూచనను గ్రహించిన గిరి, ఆ తర్వాత ఎప్పుడూ కాపీ కొట్టకుండా, కష్టపడి చదువుకున్నాడు.